www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 ఏప్రిల్ 2023
5
ఏలూరు

'చలో గుంటూరు' వెళ్లకుండా
ఆదివాసీల గృహనిర్బంధం

ప్రజాశక్తి - పోలవరం

రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులు, బేతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ సోమవారం గుంటూరులో జరుగుతున్న ఆందోళన కార్యక్రమానికి మండలం నుండి ఆదివాసీ నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. స్థానిక ఆదివాసీ నాయకురాలు బోరగం వెంకటలక్ష్మిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఆదివాసీ నాయకులు ముద్రిక రంజిత్‌కుమార్ దొర, ఇతర ఆదివాసీ నాయకులకు, గిరిజన సంఘాల నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ పవన్ కుమార్ సూచించారు.

- ధాన్యం కొనుగోలులో రైతులకు చుక్కలు
- లారీల ఏర్పాటులో ఖరీఫ్ నుంచి ఏమాత్రం నేర్వని పాఠాలు
- ఏలూరు జిల్లాలో దాదాపు 50 శాతానికిపైగా మాసూళ్లు పూర్తి
- కొనుగోలు చేసిన ధాన్యం కేవలం 25 వేల మెట్రిక్ టన్నులే
- కళ్లాల్లోనే పంట.. అకాల వర్షాలతో రైతులకు దడ
- ఉంగుటూరు, పూళ్ల, గుండుగొలనులో రోడ్డెక్కిన అన్నదాత

గుండుగొలనులో లారీల కోసం పురుగుమందుల డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతులు

పౌర సరఫరాల శాఖ

రూటే సపరేటు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పౌర సరఫరాల శాఖాధికారులు రైతుల గురించి ఆలోచిస్తున్నారా.. లారీల సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారు. ఖరీఫ్‌లో ఎదురైన లారీల సమస్యను రబీలోనూ ఎందుకు కొనసాగే పరిస్థితి ఏర్పడింది. లారీలు లేక లక్షల టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండటానికి పౌరసరఫరాల శాఖాధికారులు కారణం కాదా.. అకాల వర్షాలకు ధాన్యం తడిస్తే పౌరసరఫరాల శాఖాధికారులు బాధ్యత వహిస్తారా.. రైతుల సమస్యను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా తమకే అన్నీ తెలుసు అనే ధోరణిలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి వ్యవహరించడమే దీనికి కారణమా అనే ఆలోచన ఏలూరు జిల్లాలోని రైతాంగాన్ని వెంటాడుతున్న పరిస్థితి నెలకొంది.

ధాన్యం కొనుగోలులో పౌర సరఫరాల శాఖాధికారుల తీరు రైతులకు చర్చనీయాంశంగా మారుతోంది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో ధాన్యం కొనుగోలులో వెంటాడుతున్న సమస్యలతో రైతులు విసిగిపోతున్నారు. అధికారుల తీరు కారణంగా అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుండటంతో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. లారీలు పంపి ధాన్యం తరలించాలంటూ సోమవారం నాడు ఉంగుటూరు, పూళ్ల, గుండుగొలనులో రైతులు ఆందోళనకు దిగి, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. రైతులను ఆదుకోవాలంటూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నడిచే ఏలూరు స్పందన కార్యక్రమంలో ఏపి రైతుసంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ధాన్యం కొనుగోలులో పౌరసరఫరాల శాఖ రైతుల గోడు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోలు సంబంధించి ఖరీఫ్‌లో సమస్యలే రబీలోనూ పునరావృతమవుతున్న తీరు ఆ శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుందనే చర్చ రైతుల్లో సాగుతోంది. ధాన్యం వెంటనే తరలించకపోతే చావే శరణ్యమంటూ పురుగుమందుల డబ్బాలతో రైతులు నిరసనకు దిగిన పరిస్థితి రావడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. రబీలో పశ్చిమగోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో 79,448 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 50 శాతానికిపైగా 40,860 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. కొన్ని మండలాల్లో 60, 70 శాతం కూడా మాసూళ్లు పూర్తయిన పరిస్థితి ఉంది. పశ్చిమలో 30 శాతం పూర్తయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమలో కంటే ఏలూరు జిల్లాలో రబీలో వరిసాగు దాదాపు లక్షా 50 వేల ఎకరాలు తక్కువ. ఏలూరు జిల్లాలో సాగు చేసిన వరి పంటకు సంబంధించి 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ ధాన్యం కొనుగోలుకు కూడా పౌరసరఫరాలశాఖ పిల్లిమొగ్గలు వేస్తోంది. ఇప్పటి వరకూ 50 శాతానికిపైగా పూర్తయిన మాసూళ్ల ప్రకారం చూస్తే దాదాపు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోకే ఉంది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్న ధాన్యం కేవలం 25 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఇంకా కళ్లాల్లో లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

లారీల సమస్య ఎప్పటికి తీరేనో..

ఈ నెల 16న ధాన్యం కొనుగోలును అధికారులు ప్రారంభించారు. అంటే దాదాపు పది రోజులు గడిచిపోయింది. ఇప్పటి వరకూ లారీల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. లారీల కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకపక్క అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. సోమవారం ఏలూరుతోపాటు పలుచోట్ల వర్షాలు కురిశాయి. మబ్బులు, గాలులతో నిండిన వాతావరణం రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. ధాన్యం తడిస్తే రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. ముఖ్యంగా నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు వంటి మండలాల్లో కోతలు పొలాలు ఎక్కువగా ఉన్నాయి. ధాన్యం తడిస్తే ఇక్కడి రైతుల పరిస్థితి అగమ్యగోచరమే. పౌరసరఫరాలశాఖ అధికారులు ఇప్పటికైనా లారీల సమస్యను పరిష్కరించి రైతులకు మేలు చేయాలని అంతా కోరుతున్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యం కావాలి

- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్
- 12 పంచాయతీలకు జిల్లాస్థాయి అవార్డులు
- సూరప్పగూడెంకి రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి - ఏలూరు

గ్రామాల్లో సుపరిపాలన అందిస్తూ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మమేకం కావాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం-2023 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో సుస్థిర అభివృద్ధికి కృషిచేసిన 12 మంది గ్రామ సర్పంచులను సత్కరించారు. అదే విధంగా భీమడోలు మండలం సూరప్పగూడెం పంచాయతీ రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి సర్పంచుల సేవలే ప్రామాణికమన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం అభినందనీయమన్నారు. సచివాలయ సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి నవరత్నాలు అందరికీ అందేలా, వాటి గురించి క్షేత్రస్థాయిలో పూర్తిఅవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత, శానిటేషన్, తాగునీటి సరఫరాలో ఇతర జిల్లాల కన్నా మన జిల్లాలో బాగా జరుగుతుందన్నారు. జిల్లాలో 20 గ్రామాలను ఎంపిక చేసి సంపూర్ణ పారిశుధ్య తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని ఇది జిల్లాస్థాయిలో కూడా అమలు కానుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాల్లో సాధించిన ప్రగతి వచ్చే ఆగష్టు 15వ తేదీన వారిని సత్కరిస్తామని తెలిపారు. ఉపాధి హామీ, గ్రామ పరిశుభ్రత తదితర అంశాల్లో బుట్టాయగూడెం గ్రామ సర్పంచ్ జాతీయ స్థాయిలో అవార్డు పొందడం అభినందనీయమన్నారు. కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని అధికారులను సమన్వయం చేసుకుని సమిష్టికృషితో గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలన్నారు. డిపిఒ మల్లికార్జునరావు మాట్లాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా తొమ్మిది అంశాలను పరిశీలించి ఈ అవార్డులు ప్రకటించారన్నారు. రాష్ట్రస్థాయిలో ఏలూరు జిల్లాకు సంబంధించి భీమడోలు మండలం సూరప్పగూడెం పంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు లభించిందన్నారు. స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రగతి సాధించినందుకు ఇటు జిల్లా, అటు రాష్ట్రస్థాయిల్లో సూరప్పగూడెం పంచాయతీకి అవార్డు లభించింది. ఇక జిల్లాలో 12 పంచాయతీలకు జిల్లాస్థాయి అవార్డులు లభించాయన్నారు. గ్రామ పంచాయతీల్లో పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యకరమైన పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ, తగినంత నీరు క్లీన్అండ్‌గ్రీన్, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజికంగా సురక్షితం, పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీ అనే అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఆయా పంచాయతీలకు మార్కులు వేసి ఉత్తమ పంచాయతీలుగా ప్రకటించామన్నారు.

జిల్లాస్థాయిలో అవార్డులు అందుకున్న పంచాయతీలివే

ఆగిరిపల్లి మండలంలోని కనసానపల్లి పంచాయతీకి తగినంత నీరు కల్పనలో, భీమడోలు మండలం సూరప్పగూడెం పంచాయతీకి స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల కల్పనలో, దెందులూరు మండలం చల్లచింతలపూడి పంచాయతీకి సామాజికంగా సురక్షితం అనే అంశంలో, ఏలూరు మండలం కలకుర్రు పంచాయతీకి ఉమెన్ ఫ్రెండ్లీ అంశంలో, కామవరపుకోట మండలంలోని రామన్నపాలెం పంచాయతీకి, కలిదిండి మండలం పెదలంక పంచాయతీకి తగినంత నీరు కల్పనలో, మండవల్లి మండలం కనుకొల్లు పంచాయతీకి పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి అంశంలో, మండవల్లి మండలం మండవల్లి పంచాయతీకి ఆరోగ్యకరమైన పంచాయతీ అంశంలో, మండవల్లి మండలంలోని పుట్లచెరువు పంచాయతీకి స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల కల్పనలో, ముదినేపల్లి మండలం పెయ్యేరు పంచాయతీకి సామాజికంగా సురక్షిత అనే అంశం, ముదినేపల్లి మండలం పెదపాలపర్రు పంచాయతీకి ఉమెన్ ఫ్రెండ్లీ అంశంలో, ఉంగుటూరు మండలం ఉంగుటూరు పంచాయతీకి స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల కల్పనలో జిల్లాస్థాయి అవార్డులు లభించాయి.

పూర్తి పరిహారమిచ్చాకే పోలవరం పనులు చేపట్టాలి

సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరి ముగింపు సభలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర నేతలు

కుక్కునూరులో..

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పూర్తిపరిహారం ఇచ్చాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలని చట్టాలు చెబుతున్నప్పటికీ చట్టాలను తుంగలోతొక్కి, నిర్వాసితులను ముంచి ఏ ఒక్కరికీ పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వకుండానే ప్రాజెక్టు పనులు పూర్తిచేయడం ఎంతవరకు సమంజసమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వతీరుపై మండిపడ్డారు. సిపిఎం, సిపిఐ చేపట్టిన రాజకీయ ప్రచారభేరి యాత్ర ముగింపు సభను సోమవారం కుక్కునూరులో నిర్వహించారు. సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మైసాక్షి వెంకటాచారి అధ్యక్షతన ఈ సభ జరిగింది. ఈ నెల 10 తేదీన వీరవల్లిలో ప్రారంభమై 12 గ్రామాల మీదుగా కుక్కునూరులో ముగిసింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ పోలవరానికి నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్నా బడ్జెట్‌లో నిధులను కేటాయించకుండా, పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టుపై కేంద్ర మంత్రులు రోజుకోమాట, పూటకో ప్రకటన చేస్తూ రాష్ట్ర ప్రజలను, ప్రాజెక్టు నిర్వాసితులను అయోమయానికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో సిఎం జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఏ ఒక్కరికీ రైతులకు ఎకరాకు రూ.ఐదు లక్షలు, ప్రతీ నిర్వాసితుని కుటుంబానికి రూ.పది లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గోదావరి వరదలకు ఊళ్లకు ఊళ్లు మునిగి సర్వం కోల్పోయిన కట్టుబట్టలతో చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురై తలదాచుకున్న వరద బాధితులకు నేటికి ఇంటి నష్ట పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. వరదలకు ఇల్లు కోల్పోయిన బాధితులు ఇప్పటికీ పునరావాస కాలనీల్లోకే ఉన్నారని ఏ నిమిషాన మూడు నెల్లలో వచ్చే గోదావరి వరదలకు వారి పరిస్థితి ఏమిటని, అప్పటికైనా పూర్తిపరిహారం ఇస్తారా మళ్లీ గోదావరి వరదల్లో ముంచుతారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పోలవరానికి నిధులు కేటాయించి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ముంపుపై స్పష్టత ఇవ్వాలని, లేని పక్షంలో నిర్వాసితులను ఏకం చేసి పోరాడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ గ్యాస్, డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలను అమాంతం పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపిందన్నారు. ఎల్ఐసి, ఆర్‌టిసి, విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేసి అదాని, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు పెట్టి తమను అణచివేయాలని చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎమ్‌డి.మునీర్, జిల్లా నాయకులు ఎస్.సాయిబాబా, కె.లక్ష్మయ్య, ఏపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం దారయ్య, పిట్టా ప్రసాద్, సిపిఎం నాయకులు వై.సాయికిరణ్, కోట రామలక్ష్మి, ఎస్.లక్ష్మణరావు, రమేష్, వలీ పాషా, సిపిఐ మండల నాయకులు బాబూరావు, వి.నాగేశ్వరరావు, నరసింహారావు, పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ప్రజా ప్రయోజనాలను విస్మరించి పాలన సాగిస్తున్న ప్రధాని మోడీ విధానాలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఐ, సిపిఎం దేశవ్యాప్త ప్రచార భేరి యాత్రలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రధానకూడలి వద్ద ప్రచార భేరి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్య రావణకాష్టంగా ఉందని, నేటికి పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి నిర్వాసితుల పరిహారాన్ని ఎగనామం పెట్టే కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లు బిగించడం రైతు మెడలకు ఉరితాళ్లు బిగించడమేనని, ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యురాలు నాగమణి మాట్లాడుతూ ప్రధాని మోడీ రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నా సిఎం జగన్ తన కేసులకు భయపడి మోడీ పాదాల వద్ద సాగిల పడుతున్నారని విమర్శించారు. సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తూ గతంలో ఉన్న చట్టాలను సవరణ పేరుతో రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్పొరేట్ శక్తులకు బానిసలుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రచార భేరిలో సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, ఆకుల దుర్గారావు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.బాజీ, దుగ్గిరాల నారాయణరావు, లక్ష్మి పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో..

ధాన్యం సేకరణలో ఇబ్బందులు తొలగించాలని ఆందోళన

ప్రజాశక్తి - ఉంగుటూరు

రబీధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని లేనిపక్షంలో మంగళవారం నుంచి జాతీయ రహదారిపై ఆందోళన చేపడతామని టిడిపి, భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, రైతులు చేరుకున్నారు. నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేయాలని, ధాన్యం పట్టుబడులు వెల్లిన తక్షణం లారీలను పంపించాలని చర్యలు తీసుకుని రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే రేపటి నుంచి రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తహశీల్దారు ఎవి.రమణారావు మాట్లాడుతూ గోనె సంచులు పుష్కలంగా వస్తున్నాయని, లారీల ఇబ్బందులు సైతం తొలగించేలా జిల్లాయంత్రాంగం అన్నిచర్యలు తీసుకుంటుందని, ఆందోళన చెందొద్దని రైతులు, నాయకులకు వివరించారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

స్పందన అర్జీలకు ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వ స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జెసి బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పిడి విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలను తక్షణం పరిష్కరించేలా అధికార యంత్రాంగం పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అధికారులు ప్రతి అర్జీని ఆడిట్ చేసి ఎండార్స్‌మెంట్‌ను కచ్చితంగా ఇవ్వాలని తెలిపారు. ఈనెల 25వ తేదీన జాతీయ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో మున్సిపల్ కమిషనర్, రూరల్‌లో వైద్యఆరోగ్య శాఖాధికారులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ ద్వారా పాఠశాలల్లో ఉపాధ్యాయులు మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీని, అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా ప్రబలుతుందని దీన్ని అరికట్టడానికి ఐటిడిఎ అధికారులు, సిబ్బంది మలేరియా నుండి ప్రజలను రక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. స్పందన కార్యక్రమం ద్వారా 265 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఇంజినీరింగ్ విద్యార్థినికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

అత్యాచారానికి గురైన ఇంజినీరింగ్ విద్యార్థినికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వ వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఏలూరు శివారు ప్రాంతానికి చెందిన యువతి కానినాడలోని బిటెక్ మూడో సంవత్సరం చదువుతుండగా పెదపేర మండలం దుర్గరాలకు చెందిన అనుదీప్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను దుర్గిరాలకు తీసుకువచ్చి చిత్రహింసలు పెట్టి, వేడి నూనె ఒంటిపై పోసి, అత్యాచారానికి పాల్పడిన ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమవుతుందని, న్యాయం చేయలేకపోతుందని విమర్శించారు. ఎంతటి వారైనా తప్పచేస్తే వెంటనే శిక్ష పడేవిధంగా సంకేతాలు రాష్ట్ర ప్రభుత్వం పంపాలిగానీ కొంతమేరకు ఇలాంటి ఘటనలు అదుపుచేయొచ్చన్నారు.

మిల్లులకు ధాన్యం తరలించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలూరు

అకాల వర్షాల నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలని, నాణ్యమైన గోనె సంచులు అందించాలని, తూకంలో తేడాలు, నూక శాతం పేరుతో డబ్బు వసూలు ఆపాలని ఏపి రైతు సంఘం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి లావణ్యవేణికి ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలులో అనేక సమస్యలతో రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వాతావరణ పరిస్థితులు మారి ఆకాశం మబ్బులుగా ఉండటం, జిల్లాలో అక్కడక్కడ చినుకులు పడడంతో రైతాంగం ఆందోళన చెందుతుందన్నారు. ధాన్యం రవాణాకు తగినన్ని వాహనాలు అందుబాటులో లేక కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోయిందన్నారు. మిల్లులకు ధాన్యం చేరిన తర్వాత నూక శాతం పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆర్‌బికెకు నిర్దేశించిన 24 ట్రిప్ షీట్లు వచ్చిన తర్వాత ట్రిప్ షీట్లు దొరకడం లేదని, మిల్లు వద్ద ఉన్న వే బ్రిడ్జి కాటాలో తూకం కాకుండా కళ్లాల్లో తూకం తక్కువ వచ్చిందని రైతుల నుండి ఎన్ని కేజీలు తేడా వస్తే అంత ధాన్యానికి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఉల్లంకి నాంచారయ్య, రైతులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించి వాటిని పరిష్కరించే దిశగా జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేయాలని ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించారు. సమగ్ర ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లోనే ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సివిల్ సంబంధిత ఫిర్యాదులను పోలీసు శాఖ పరిష్కరించలేదని ఆయా ఫిర్యాదులను కోర్టుల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి సిఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వింటున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి

గురుకులాల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 28వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు గురుకుల విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ డి.నరసింహస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ఏపి గురుకుల పాఠశాలలో ఏపి గురుకుల విద్యాలయాల సంస్థచే నిర్వహిస్తున్న ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతులకు, జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం డిగ్రీ 2023-24 విద్యాసంవత్సరం ప్రవేశానికి నిర్వహించే ఎపిఆర్ఎస్ క్యాట్-2023, ఎపిఆర్‌జెసి, డిసి సెట్-2023కు దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 24వ తేదీతో ముగియనుండగా పలు కారణాల వల్ల విద్యార్థుల దరఖాస్తు చేసుకోలేని అందరికీ అవకాశం కల్పించేందుకు గడువు పొడిగించినట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను http//:aprs.apcfss.in ద్వారా సమర్పించాలని ఆయన తెలిపారు.

మేడే వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - దెందులూరు

మే డే ను మండలంలో కార్మికులు, కర్షకులు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. సోమవారం ఎం.రమేష్ అధ్యక్షతన సిఐటియు మండల సమావేశం స్థానిక పాఠశాలలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న లింగరాజు మాట్లాడుతూ ప్రపంచీకరణ విధానాలు అమలు చేస్తూ కార్మికులపై అనిబారం పెంచుతూ జీతాలు తగ్గిస్తూ, పారిశ్రామికవర్గాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కార్మికుల ఉత్పాదన శక్తి పెరగడంతో రోజుకు ఆరు గంటల మాత్రమే పని చేయడం ద్వారానే యజమానులకు లాభాలు భారీగా వస్తున్నాయని, అలాంటిది మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో 10 నుండి 12 గంటల వరకూ కార్మికుల శ్రమను దోచుకునే అవకాశాన్ని యాజమాన్యాలకిచ్చిందన్నారు. మండలంలో ఐదు గ్రామాల్లో సిఐటియు జెండాలు ఎగురవేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కామేశ్వర, మండల నాయకులు లక్ష్మీ, కనకదుర్గ, రాంబాబు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని కార్మికులందరూ ఘనంగా జరుపుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభానీ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు మండల, పట్టణ కమిటీల సమావేశం పి.సూర్యారావు అధ్యక్షతన జరిగింది. మే డే వాల్‌పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభానీ మాట్లాడుతూ మేడే అంటే కార్మికులు పోరాటం చేసి 16 గంటల పని దినాన్ని ఎనిమిది గంటల పనిదినంగా సాధించుకున్న రోజు అని గుర్తుచేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు, సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఆర్.లక్ష్మీపాపని, కార్యదర్శి పటాన్ మస్తాన్, కమిటీ సభ్యులు బి.బాలరాజు, రేలంగి నాగరాజు, వెల్పుల రాజు, వి.నాగలక్ష్మి, జి.విమల, శిరోమణి, నాగ దుర్గ, లక్ష్మణరావు, లక్ష్మణ్, జగదీశ్వర్ పాల్గొన్నారు.



గుండుగొలను సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సమస్యలు పరిష్కరించాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - భీమడోలు

కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు వాహనాలు ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ఏర్పడుతున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు పూళ్ల రైతు భరోసా కేంద్రం వద్ద, గుండుగొలను సొసైటీ సమీపంలో సోమవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. గుండుగొలను సొసైటీ వద్ద టిడిపి నాయకులు సిరిబత్తిన కొండబాబు ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. తమ అవసరాలకు సరిపడా రీతిలో గోనె సంచులు అందించాలని, రవాణా సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. పూళ్ల రైతు భరోసా కేంద్రం వద్ద ఇవే సమస్యల పరిష్కారం కోరుతూ రైతులు ఆందోళన చేపట్టారు. భీమడోలు ఇన్‌ఛార్జి తహశీల్దార్ షంషుద్దీన్, వ్యవసాయ అధికారి ఉషారాణి ఆందోళన చేస్తున్న రైతులకు సర్ది చెప్పారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.

మండవల్లి ఇఒపిఆర్‌డిగా ఆనందబాబు

ప్రజాశక్తి - మండవల్లి



ఆనందబాబు

మండలానికి నూతన ఇఒపిఆర్‌డిగా ఆనందబాబు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు విధులు నిర్వహించిన బాలకృష్ణారావు బదిలీపై వెళ్లడంతో ఇప్పటివరకు కార్యదర్శి రాధికాకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా కెవిబిపురం మండలానికి ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న ఆనందబాబును మండవల్లికి బదిలీ చేసినట్లు తెలిపారు. దీంతో సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాట్రాయి

జైభీమ్ అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో యువసేన నాయకులు బి.రామకృష్ణ, కె.వీరవెంకటేశ్వరరావు, కె.ప్రతాపు, కె.నాగేశ్వరరావు, ఎం.ఆశసుందర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం చిన్నంపేట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం చేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న వ్యాధిగ్రస్తులు కొమ్ము రామకృష్ణకు, రెండేళ్ల నుంచి పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన కొమ్ము దేవదాసు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకుని అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి రూ.4500 నగదు, 25 కేజీల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ చాట్రాయి మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న వ్యాధిగ్రస్తులకు రూ.20 వేలు ప్రతినెల పెన్షన్ ఇవ్వాలని, మండలంలో కిడ్నీ పేషెంట్లను గుర్తించి క్రియాటిన్ టెస్టులను చాట్రాయి పభుత్వ ఆసుపత్రిలో చేయించటానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు నుంచి శుభ్రపరిచిన ఫ్లోరైడ్ లేని మంచినీటి సరఫరా ప్రతి గ్రామానికి సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

చింతలపూడి : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వం అని చిన్నంపేట జై భీమ్ యూత్ కన్వీనర్ కొమ్ము నాగేశ్వరరావు, వీర వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని శివపురం గ్రామానికి చెందిన కలపాల డానియల్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్నంపేట జైభీమ్ అంబేద్కర్ యూత్ కన్వీనర్ బి.రామకృష్ణ, కె.వీరవెంకటేశ్వరరావు, కొమ్ము నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం డానియల్ కుటుంబానికి రూ.పది వేలు నగదు, 25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి ఆనందం, ఎం.ఆశ, సుందర్‌కుమార్, కుటుంబరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అదనపు కట్నంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముసునూరు

అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తోన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చింతలవల్లి గ్రామానికి చెందిన బుల్లా వెంకటేష్‌కు, గోపవరం గ్రామానికి చెందిన మల్లేశ్వరికి 2020లో వివాహమైంది. ఆ సమయంలో వెంకటేష్‌కు రూ.2.50 లక్షల కట్నం, బంగారం, వెండి వస్తువులను ఇచ్చారు. వీరికి ఒకు కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం మల్లేశ్వరి గర్భవతిగా ఉంది. ఈ క్రమంలో వేరే మహిళతో వివాహేతరం సంబంధం పెట్టుకుని తనను అదనపు కట్నం కోసం ప్రతిరోజు వేధిస్తున్నాడని మల్లేశ్వరి తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ ఎం.కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు నాటుసారా విక్రేతలకు రిమాండ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎపిగుంట, వీరభద్రవరం గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో సోమవారం దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పది లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వారిని చింతలపూడి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఆవు పొడవడంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆవు పొడవడంతో ఆ వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం మండలంలోని గురజ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురజ దళితవాడకు చెందిన పరిసిపోగు సుందరరావు (50) ఇంటి వద్ద నుంచి సైకిల్‌పై గురజ సెంటర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ రక్షిత మంచినీటి పథకం చెరువు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆవు ఆకస్మాత్తుగా సైకిల్‌పైకి దూసుకు వెళ్లి సైకిల్‌పై ఉన్న సుందరరావును పొడిచింది. దీంతో సుందరరావు కింద పడడంతో కాలుకు గాయామైంది. స్థానికులు అతడిని 108 వాహనంలో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కైకలూరు నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన అడుసుమిల్లి సత్యప్రసాద్‌కి చెందిన ఆవులు గతంలో కూడా ఇదే మాదిరగా గ్రామస్తులను పొడిచాయన్నారు. ఈ ప్రమాదాల్లో పలువురు వ్యక్తులకు గాయాలయాయన్నారు. గాయపడిన వ్యక్తికి వైద్య ఖర్చులు చెల్లించడంతో పాటు సత్యప్రసాద్‌పై అధికారులు చర్యలు తగిన తీసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి స్వల్పగాయాలు

ఉంగుటూరు : మండలంలోని నాచుగుంట వద్ద జాతీయ రహదారిపై సోమవారం ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదానికి గురైంది. బాదంపూడి నుంచి భీమడోలు వైపు వెళ్తున్న లారీ నాచుగుంట వద్ద మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధాన్యం లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. లారీ డ్రైవర్‌కి స్వల్పంగా గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేసి స్థానిక ఆసుపత్రికి పంపించారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్టు

జంగారెడ్డిగూడెం : మండలంలోని తాడువాయి పంచాయతీ గొల్లగూడెం గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ బాల సురేష్ బాబు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గొల్లగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి ఆంజనేయ స్వామి విగ్రహం ధ్వంసం చేసిన సంఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు నాగేశ్వరరావును అరెస్ట్ చేశారు. ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసిన స్థలానికి సంబంధించిన చవల వెంకన్న దంపతుల పేర్లను శిలాఫలకంలో చేర్చలేదనే కారణంతో వారి పెద్ద కుమారుడు చవల నాగేశ్వరరావు విగ్రహం, శిలాఫలకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు



భీమడోలులో...

ప్రజాశక్తి - భీమడోలు

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన మండలంలోని సూరప్పగూడెంను ఇతర గ్రామపంచాయతీలు ఆదర్శంగా తీసుకొని రానున్న కాలంలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాలని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కె.రామయ్య కోరారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం తొలిసారిగా 2021-22 ఆర్థిక సంవత్సరానికి ఉత్తమ గ్రామపంచాయతీలను ఎంపిక చేసింది. స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు గల గ్రామపంచాయతీగా భీమడోలు మండలం సూరప్పగూడెం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. గ్రామపంచాయతీ అధ్యక్షులు వెజ్జు బాలాజీ, గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, ఎంపిటిసి సభ్యులు ఇంజేటి జూనియర్ గ్రామపంచాయతీ తరపున సత్కారం పొందేందుకు సోమవారం అమరావతికి వెళ్లారు. భీమడోలు మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో సమావేశ మందిరం వేదికగా అభినందన కార్యక్రమాన్ని సోమవారం ఇన్‌ఛార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.సత్యనారాయణ నిర్వహించి గ్రామపంచాయతీ అధ్యక్షులతో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి, ఎంపిటిసి సభ్యులను సత్కరించారు.

రాష్ట్రస్థాయిలో సూరప్పగూడెం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన నేపథ్యంలో సర్పంచిని తాడేపల్లిలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ గిరిజాకుమారి సోమవారం సత్కరించి మెమెంటో అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, ఎంపిటిసి సభ్యులు ఇంజేటి జూనియర్ పాల్గొన్నారు

బుట్టాయగూడెం : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం బుట్టాయగూడెం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 21 పంచాయతీల సర్పంచులకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మాట్లాడారు. మండలంలో అన్ని అభివృద్ధి పనులు చేయడానికి సహకరించిన, కృషి చేసిన సర్పంచులను సన్మానించారు.

ఉంగుటూరు : ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సర్పంచి, ఎంపిటిసి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, ఇఒపిఆర్‌డి షంషిద్దీన్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు విష్ణుమూర్తి, మండల సచివాలయం కన్వీనర్ డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సింగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కైకలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కృష్ణమోహన్ మాట్లాడారు. పలు గ్రామాల సర్పంచులను, ఎంపిటిసి సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.శివాజీ, బలరామరాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామలింగేశ్వరావు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ముసునూరులో...

ముసునూరు : మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో ముసునూరు, చెక్కపల్లి, లోపూడి, అక్కిరెడ్డిగూడెం, వలసపల్లి, గుళ్లపూడి, కాట్రేనిపాడు, రమణక్కపేట, సూరేపల్లి, కోర్లగుంట గ్రామ పంచాయతీ సర్పంచులకు జెడ్‌పిటిసి వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు ఆధ్వర్యంలో అవార్డులు అందించి సత్కరించారు. మౌలిక సదుపాయాల కల్పన, పేదరిక నిర్మూలన, సామాజిక భద్రత, సుపరిపాలన, మంచినీటి సమృద్ధి కల్పించడంతో పాటు పరిశుభ్రత కలిగిన గ్రామాలగా అభివృద్ధి చెందడంతో ఆయా గ్రామాల సర్పంచులను సత్కరించినట్లు వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయణ తెలిపారు.

జీలుగుమిల్లి : పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్క సర్పంచి కృషి చేయాలని ఎంపిడిఒ కె.మంగతాయారు అన్నారు. సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో వివిధ విభాగాల వారీగా అభివృద్ధి జరిగిన తొమ్మిది పంచాయతీలకు అవార్డులు ఎంపిపి కోర్స పోసమ్మ చేతులమీదుగా అందించారు. అనంతరం సర్పంచులను సత్కరించారు.

దెందులూరు : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని దెందులూరులో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎబిపివి.లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో చల్లచింతలపూడి, సోమవరప్పాడు, పెరుగుగుడెం, రామారావుగూడెం, పోతునూరు, కొవ్వలి, గోపన్నపాలెం, కొత్తగూడెం, గంగన్నగూడెం గ్రామ పంచాయతీలకు అవార్డులతోపాటు ప్రసంశా పత్రాలు అందించి ఘనంగా సన్మానించారు.

ముదినేపల్లి : జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీగా మండలంలోని పెదపపాలపర్రు గ్రామ పంచాయతీ ఎంపికైంది. ఈ మేరకు సోమవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చేతులమీదుగా జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం గ్రామ సర్పంచి గంటా రాకేష్‌కుమార్ అందుకున్నారు. రాకేష్‌ను పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు అభినందించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో పలువురు సర్పంచులను ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ సన్మానించారు.

పోలవరం : పోలవరం పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. పోలవరం పంచాయతీ సర్పంచి పొడుంపుష్ప అధ్యక్షతన ఎంపిటిసి సభ్యులు కాశీ ధనలక్ష్మి కొత్త పట్టిసీమ గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులను సర్పంచి విజయదుర్గ, పంచాయతీ సెక్రటరీ తాతి విజయ్‌కుమారి, సచివాలయ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి సభ్యులు ఉలవల వరలక్ష్మి, మైగాపుల దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి సత్కరించారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని చక్రదేవరపల్లి గ్రామపంచాయతీకి మండల స్థాయిలో తృతీయ ఉత్తమ పంచాయతీ పురస్కారం లభించింది. సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని చక్రదేవరపల్లి గ్రామ పంచాయతీని నీటి సమృద్ధి కలిగిన గ్రామ పంచాయతీ విభాగంలో ఉత్తమ ప్రతిభను కనబర్చినందుకు అభినందిస్తూ మండల స్థాయి తృతీయ ఉత్తమ పంచాయతీ పురస్కారాన్ని కేటాయించినట్లు ఎంపిడిఒ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచి సత్యనారాయణకు పురస్కారాన్ని ఎంపిడిఒ కిరణ్‌కుమార్, తహశీల్దార్ స్లీవజోజి, జెడ్‌పిటిసి సభ్యులు పి.బాబ్జి అందించారు. సర్పంచిని సన్మానించి మెమెంటో అందించారు.

మండవల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని వివిధ విభాగాలలో ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన ఆయా పంచాయతీలకు చెందిన సర్పంచి కార్యదర్శులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అగస్తి ఆది విష్ణు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, ఇఒపిఆర్‌డి ఆనంద్‌బాబు, ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో పాత్రికేయుడు మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని యనమదల గ్రామానికి చెందిన పాత్రికేయుడు మాపర్తి సత్యనారాయణ (సత్యం) (54) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన టీవీ ఛానల్, వివిధ పత్రికల్లో పాత్రికేయునిగా పని చేశారు. అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనే సత్యనారాయణ ఆకస్మిక మృతికి ప్రజా సంఘాల నేతలు, సామాజిక వేత్తలు, పాత్రికేయులు, నూజివీడు పరిసర ప్రాంత ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మెప్మా టిఎంసిగా నాగమణి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



పి.నాగమణి

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) టిఎంసిగా పి.నాగమణి బాధ్యతలు చేపట్టారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన నాగమణికి మెప్మా సిబ్బంది ఆర్‌పిలు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. పట్టణంలో పేదలందరికీ ఇల్లు కార్యక్రమాన్ని పూర్తి చేయడంలో దృష్టి సారించి చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఆదివారం కురిసిన గాలి, వానకు మండలంలోని గురజ దళితవాడలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఈ విషయాన్ని మాలమహానాడు కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసరావు మండల విద్యుత్ ఎఇ పి.రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎఇ రవికుమార్ గురజ లైన్‌మేన్ వాసిపల్లి పేతురుతో పాటు తన సిబ్బందిని వెంటనే పంపించి విరిగిపడిన విద్యుత్ స్తంభం స్థానంలో సోమవారం నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించారు. అడిగిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కారించిన విద్యుత్ ఎఇ రవికుమార్‌కు, లైన్‌మేన్ పేతురుకు ముత్యాల శ్రీనివాసరావు, గ్రామ దళితులు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రజా సమస్యలను గాలికొదిలేసిన వైసిపి'

ప్రజాశక్తి - కైకలూరు

ప్రజా సమస్యలను వైసిపి ప్రభుత్వం గాలికొదిలేసి అక్రమ కేసులపై దృష్టి సారించిందని టిడిపి నాయకులు విమర్శించారు. పట్టణంలో పలు వీధుల్లో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జానీ ఆధ్వర్యంలో అబ్బాస్ డాక్టర్ వీధి, సంతమార్కెట్, గోలీలదొడ్డి వెనుక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పి.త్రినాథరాజు మాట్లాడారు.

కల్యాణికి ముద్దరబోయిన పరామర్శ

ప్రజాశక్తి - నూజివీడు

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రతిపక్ష నాయకులను అణిచివేసేందుకు అక్రమ కేసులు బనాయిస్తున్న జగన్ రెడ్డి భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. టిడిపి నాయకురాలు మూల్పూరి కల్యాణిని సోమవారం ఆయన పరామర్శించారు. .

సాంకేతికంగా రోడ్డు సర్వే

జంగారెడ్డిగూడెం : ఆధునిక సాంకేతిక పరికరాలతో పట్టణంలోని శ్రీనివాసపురం రహదారిని సర్వే చేస్తున్నామని పట్టణ ప్రణాళిక అధికారి జగదీశ్వరరావు తెలిపారు. సోమవారం శ్రీనివాసపురం రోడ్డులో టోటల్ స్టేషన్ ఆధునిక సర్వే సాంకేతిక పరికరంతో సర్వే కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక సచివాలయ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

15,081 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో ఇప్పటివరకు 15081 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తహశీల్దారు కెవి.రమణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ధాన్యాన్ని 372 లారీల ద్వారా రైస్ మిల్లులకు రవాణా చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 6,98,100 గోనె సంచులను సరఫరా చేయడమైందని పేర్కొన్నారు. అధికంగా గోనె సంచులను రప్పించి, రోజుకు 120 నుంచి 140 వరకు లారీలను రప్పించుకొని ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా అధికారుల సూచనలతో ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. మండలంలో 24 రైతు భరోసా కేంద్రాలు ఉండగా, చేబ్రోలు సొసైటీ పరిధిలో ఏడు కేంద్రాలు, బొమ్మిడి సొసైటీ పరిధిలో రెండు కేంద్రాలు, బాదంపూడి సొసైటీ పరిధిలో మూడు కేంద్రాలు, డిసిఎంఎస్ ఏలూరు పెరుగుగూడెం పరిధిలో తొమ్మిది కేంద్రాలు, ఎఫ్‌పిఒ అంబరుపేట వారి పరిధిలో ఆర్‌బికెలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఉంగుటూరు మండలంలో గోనెసంచులను, లారీలను తగిన సంఖ్యలో ఉంచుకొని ఎప్పటికప్పుడు రైతులకు సరఫరా చేయు నిమిత్తం తగిన చర్యలు తీసుకున్నామన్నారు.

కళాశాలకు పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు



పుస్తకాలు అందిస్తున్న గ్రంథాలయ సంఘం నాయకులు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ సంఘం తరపున కళాశాల గ్రంథాలయానికి సుమారు రూ.2.50 లక్షల విలువైన రెండు వేల పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మానవ వికాస దశలో పుస్తకం మనిషిని మహోన్నతునిగా మలచిందన్నారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు గ్రంథాలయ సంఘం సంయుక్త కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒక మంచి పుస్తకం వెయ్యి మంది మిత్రులతో సమానమన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంఘం కోశాధికారి, కళాశాల ఐక్యు ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఈ పుస్తకాలు ఆడియో, వీడియోల రూపంలో అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని విజ్ఞాన సౌభాగ్యం చేయాలని అన్నారు. సీనియర్ న్యాయవాది, ట్రైనర్ కూన కృష్ణారావు సైబర్ నేరాలు - చట్టాలు అవగాహన అంశంపై వివరించారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి గ్రంథాలయ సంఘం తరపున ప్రశంసాపత్రం, పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డయ్య, లైబ్రరీ ఇన్‌ఛార్జి హెప్సిబా, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

పాఠశాలలు, కళాశాలలకు భరతమాత చిత్రపటాలు

ప్రజాశక్తి - మండవల్లి

భరతమాత విశిష్టతను ప్రతి విద్యార్థి తెలుసుకునే విధంగా పాఠశాలలకు భరతమాత చిత్రపటాలను వితరణగా అందించడం అభినందనీయమని డిపిఆర్‌టియు మండలాధ్యక్షుడు రామోజీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మండవల్లిలో మాట్లాడుతూ మండలంలోని పాఠశాలలకు భరతమాత ఫొటోలను అందించాలని తపన ఫౌండేషన్ అధినేత గారపాటి చౌదరిని కోరినట్లు చెప్పారు. ఆయన పాఠశాలలపై ఉన్న గౌరవంతో కైకలూరు నియోజకవర్గంలోని 250 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలుకు భరతమాత ఫొటోలను అందిస్తామని చెప్పారన్నారు. ఒక్కొక్క ఫొటోకు రూ.1200 ఖర్చు చేసి 12/18 సైజు కలిగిన భరతమాత చిత్రపటాలను లామినేషన్‌తో చుట్టూ ఫ్రేమ్ కట్టించి పాఠశాలలకు వితరణగా అందించడం అభినందనీయమన్నారు. ఆ ఫొటోలను ప్రతి పాఠశాలకు అందించినట్లు చెప్పారు. ఫొటోల పంపిణీకి సహాయ సహకారాలు అందించిన గారపాటి సీతారామాంజనేయ చౌదరికి డిపిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం తరపున కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేంద్ర, కందుల వెంకటేశ్వరరావు, బండి దివాకర్ పాల్గొన్నారు.

సాగు భూమికి హక్కులు కల్పించాలని వినతి

నూజివీడు : తరతరాలుగా భూమిలో సాగు చేస్తున్న నేటి వారసుల పేర్లు తొలగించడంతో బాధితులు లబోదిబోమం టున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నీలా వనవెంకటేశ్వర్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రకు సోమవారం వినతిపత్రం అందించారు. సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర మాట్లాడుతూ ఈ సమస్య తన దృష్టికి రాలేదని, త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముసునూరి సతీష్‌కుమార్, అధ్యక్షులు అలీ అబ్బాస్, ఉపాధ్యక్షులు గరికపాటి నాగవల్లి కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలతో పాటు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు సత్యసాయి సేవా సమితి, భీమడోలు శాఖ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా, భీమడోలు సర్పంచి పి.సునీతమాన్సింగ్ తెలిపారు. భీమడోలు బైపాస్ రోడ్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని వారు సోమవారం ప్రారంభించారు. ఇదే క్రమంలో భీమడోలు జంక్షన్ సమీపంలో మూగజీవుల దాహార్తి తెచ్చేందుకు ఏర్పాటుచేసిన నీటి తొట్టె పనితీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా చలివేంద్రాల నిర్వాహకులు వర్ధినీడి వెంకటేశ్వరరావు (సత్యసాయి) మాట్లాడుతూ చలివేంద్రం ద్వారా వారంలో మూడు రోజులు పాటు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ఇతర సమయాల్లో రక్షిత గోదావరి జిల్లాలను తాగునీటిగా అందిస్తామన్నారు. పశువులు ఎక్కువగా ఉన్న భీమడోలు జంక్షన్‌లో ప్రత్యేకించిన తాగునీటి తొట్టెను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ తొట్టెను పొలసానిపల్లి సర్పంచి షేక్ రహీమా బేగం హసేన ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - టి.నరసాపురం

భూముల రీసర్వేతో దీర్ఘకాలిక భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని డిప్యూటీ తహశీల్దార్ ఎస్.రాధాకృష్ణ తెలిపారు. మండలంలోని బొర్రంపాలెంలో జగనన్న శాశ్వత భూహక్కు పథకంపై అవగాహన కల్పించడానికి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాధాకృష్ణ మాట్లాడారు. బొర్రంపాలెం గ్రామ పరిధిలో 4242 ఎకరాల భూమిని రీసర్వే కోసం రికార్డులు పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

'జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని ఎంపిపి కోర్స పోసమ్మ అన్నారు. స్థానిక ఎంపిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల్లోకి వెళ్లడం వల్లే మంచి స్పందన వచ్చినట్లు చెప్పారు. మండల సచివాలయ కన్వీనర్ వనమా రామకృష్ణ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 70 శాతం వరకు స్టిక్కర్ల కార్యక్రమం పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రసాద్, టౌన్ ప్రెసిడెంట్ కక్కిరాల చక్రి, రాము, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్ పాల్గొన్నారు.

HON'BLE FAMILY CUM V ADJ COURT AT VIJAYAWADA
IN FCOP NO. 1678/2021
Bhimavarapu Venkata Ratnam ...Petitioner
And
Vemuri (Bhimavarapu) Jayasri ...Respondent

శ్రీ భీమవరపు వెంకటరత్నం గారు శ్రీమతి వేమూరి (భీమవరపు) జయశ్రీ W/o వెంకటరత్నంగారు పైన విడాకుల కొరకు దావా 2021లో వేసియున్నారు. అప్పటి నుంచి దావాలో ప్రతివాది వారు నోటీసు అందుకోకుండా తాత్సారం చేయటం కారణం చేత ది.11-04-2023న పత్రికా ముఖంగా నోటీసుని ప్రచురించమని ఆర్డర్ వేసియున్నారు. కావున ప్రతివాది అయిన శ్రీమతి జయశ్రీ గారికి పత్రికముఖంగా నోటీసు జారీ చేయుచున్నాము. తదుపరి వాయిదా 16-05-2023, నాటికి తమరు స్వయంగా గాని తమరి తరపున న్యాయవాది గాని కోర్టుకి హాజరు కావలెనని తెలియజేయడమైనది.

B.V.V.Suryanarayana,
Advocate for Petitioner,
Vijayawada
Ph No. 98488 64303.

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 310/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ...*Plaintiff*
Vs
Borra Kanaka Mahalakshmi another ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. బొర్రా కనక మహాలక్ష్మి, W/o. దశరథరావు, హిందువు, స్త్రీ, 47 సంIIలు, డో.నెం. 10-7, అడవిపాలెం, యలమంచిలి మండలం.
2. పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, హిందువు, పురుషుడు, 39 సంIIలు, డో.నెం. 19-5-11, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 27-04-2023వ తేదీన ఉదయం 10.30 నిIIలకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 301/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ...*Plaintiff*
Vs
Midde Swapna and another ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. మిద్దే స్వప్న, S/o. లక్ష్మణరావు, హిందువు, స్త్రీ, 45 సంIIలు, డో.నెం. 20-1-8, శంభునిపేట, పాలకొల్లు.
2. పీతాని సత్యనారాయణ, S/o. గాంధీ, హిందువు, పురుషుడు, 46 సంIIలు, డో.నెం. 21-8-11/ఎ, యడ్లబజార్, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 26-04-2023వ తేదీన ఉదయం 10.30 నిIIలకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 367/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ...*Plaintiff*
Vs
Pajjuri Lakshmana Rao another ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. పజ్జూరి లక్ష్మణరావు, S/o. సూర్యనారాయణ, హిందువు, పురుషుడు, 44 సంIIలు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల సూర్య వంశీధర్, S/o. చంద్రశేఖర్, హిందువు, పురుషుడు, 41 సంIIలు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 26-04-2023వ తేదీన ఉదయం 10.30 నిIIలకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku